# దుర్దినాలు

[కథానిక]

= శ్రీ రుక్మిణీనాథ్ =

'అమ్మయ్య!' అని చెలమయ్య నిట్టూర్పు విడిచాడు. ఉత్తరియ్యంతో మొహం తుడుచుకున్నాడు. మధ్యాన్నం పెట్టుకున్న గంధాక్షింతలు చెమటకు కారి, నానాఅసహ్యం వేసిందిగూడాను. స్నానం చేద్దామని అయితే వుందిగాని, ఇక్కడ కాదు- ఇంటి కెళ్లాక తీరిగ్గా స్నానం చెయ్యొచ్చు. కుచ్చిళ్లు తీసి, బజానా పోను చేతిలో పడ్డ అయిదువందల పైచిలుకు నోట్లూ చెంగుచివరన ముడేసి, బొడ్డున దోపుకున్నాడు. రిజిస్ట్రారు ఆఫీసులోంచి బయలుదేరాడు. తన వొళ్లు తనకే అసహ్యం వేస్తోంది. గుమ్మడిపండువాటంగా బట్ట ఎగదోపి, గబగబా అడుగులు వేసుకుంటూ బయలుదేరాడు. వొళ్లంతా గుమ్మ కొట్టుకుంది! చెట్ల మీది ఎండగూడా జర్రున జారింది. కాస్త దూరం నడిచేసరికి మంచినీళ్ల కుళాయి కనబడింది. నిలబడ్డాడు. పంపు ఖాళీకాగానే కాళ్లూ, చేతులూ, వీపూ, మొహమూ కడుక్కుని, ఉత్తరియ్యం తడిపి, పిడిచి తుడుచుకుని, పిడిచి కప్పుకుని బయలుదేరాడు. ఉన్న కాస్త పొలమూ అమ్ముకురావడం ఏమో, ఏదో కర్మ చేసినట్టుగా వుంది తనకు. పిత్రార్జితం అంతా కరారావుడుచుట్టడం అయింది. ఇహ నలుసంతైనా లేదు. ఇన్నాళ్లనుంచి కనిపెట్టుకున్నందుకు ఇంత భిక్షపెడుతున్న కాస్తమడీ ఇవాళతో, సంపూర్ణంగా కడిగేశాడు తను. ఇదీ బాగానే వుంది. తను కార్యాలకూ కరామత్తులకూ కర్చు పెట్టాడుగాని కంచం మార్చి మట్టెలు చేయించలేదు. కాలం కలిసి రాకపోతే తనేం చేస్తాడు?

"బండీ కావాలా?"

జట్కా బండీవాడు! ఎవడి గొడవ వాడిదీ! 'అలోలక్షణా' అంటూ వున్నది అమ్ముకుని తాను వొస్తాంటే - 'నానీటు చూడు, నాగోటు చూడు, నా పెళ్లాం దమ్మక్క పేటలో దంచుకుతింటోం' దన్నట్లు, తనకు జట్కా బండా?

"బండీ!"

"అక్కర్లేదు!"

బండీవాడు కంచీ చక్రాలలో అలవోకగా పెట్టి టకటకా చప్పుడు చేస్తూ వెళ్లిపోయాడు. చెలమయ్య పరధ్యాన్నంగా ఆలోచిస్తూ ముందుకు వొచ్చాడు.

"ఏమండోయ్ - బావగారూ?"

చెలమయ్య వెనక్కి తిరిగిచూచాడు. శీతయ్య! శీతయ్య తన పెళ్లానికి పెత్తల్లికొడుకు; పేటలో వుంటున్నాడు.

"ఏం శీతయ్యా, అంతా బావున్నారా?"

"ఆఁ, నీదయవల్ల. ఎప్పుడొచ్చావేమిటి? పిల్లా జెల్లా అంతా బావున్నారా? మా అక్కయ్య కులాసాగా వుందా?"

"ఆఁ"

చెలమయ్య ధోతీని సరీగా సర్దుకున్నాడు.

ఇద్దరూ నడుస్తూ కభుర్లు చెప్పుకుంటున్నారు.

"పెద్దదాని పెళ్లి చేస్తావా?"

"ఆఁ, చెయ్యాలి. ఐతే, నువ్వు యిల్లు కట్టావుట?"

"ఏదో యింత కుటీరం! స్వగృహే అంటూ వోటి వుండకపోతే - మన భ్రెష్టిగాళ్లకు కుదరదయ్యా బావా? ఏమంటావు?"

"కాదూమరీ?"

చెలమయ్య నెమరుకు తెచ్చుకుంటున్నాడు.— యిల్లే అమ్మి పొలమే ఉంచుకుందామంటే తనభార్య విన్నదా? ఇంటిన పడి రభధూళి చేసిందిగానీ. ఎంత రెక్కలు విరుచుకున్నా, ఎన్ని కానిపనులు చేసినా నాలుగు గోడల మధ్యా అంటూ, నాప్రాణం అంటూ వున్నంతకాలం పణమటింటో పడుకుని ఛస్తానంటూ ఏడ్చి రాగాలెట్టిందిగానీ! దానిమాటా నిజమే. ఆఁ వాళ్లను ఉసాక్కరించగూడదు.

"మీయింట్లో అంతా కులాసాగా వున్నారా?"

"ఆఁ. వొస్తున్నావుగా, చూద్దుగాని. ఏం, అల్లా మొహం పెట్టావ్? ఈసారిగూడా రాకుండా పోదామనుకున్నావా? ఆపప్పులు ఉడకవు." అన్నాడు శీతయ్య.

"నేను రానన్నానటోయ్ శీతయ్యా. మొత్తానికి మీగుణం పోనిచ్చావు కావుగదా" అని చెలమయ్య పొడుంకాయ రొండినించి తీశాడు.

"పోనీగదా చెలమైబావా, ఇద్దైనా నేను కనబడి, నిలేసి బలవంతం చేస్తే వొస్తున్నావుగాని, నీ అంతట నీవు సరాసరి మాయింటి కొచ్చా? నే నేం పరాయివాణ్ణా?"

"ఏవో పనులు అఘోరించి, తెమిలి చావవు"

—సందుమలుపు తిరిగారు.

"శింగినాదం జీలకర్రానూ! ఆమడలు దూరంకాని అంతఃకరణలు దూరంకావు. ఆకాయ యిలా తే"

చెలమయ్య పొడుంకాయ యిచ్చాడు. శీతయ్య వోచిటికె పీల్చి తర్రున చీది, ఉత్తరియ్యానికి తుడుచుకుని, కాయ యిచ్చేశాడు. ఇద్దరూ ఇంటిదగ్గిరికి వొచ్చారు.

"ఇదే"

"ఇంకేం? నిక్షేపంలా వుంది. వెనకా ముందూ వసారా! 'ఏదో కుటీరం' అంటా వేం?"

శీతయ్యమొహం విప్పారింది.

"ఇంటికేం, నాల్గుగోడలమధ్యా చందుకాపెట్టిల్లే వుందీ" అన్నాడు శీతయ్య.

ఇద్దరూ లోపలికి వెళ్లారు. ఇల్లాలు పిల్లలకు అన్నాలు పెడుతున్నది. చూచీచూడగానే లేచి, ఎడచంటివాణ్ణి చంకనేసుకుని వొచ్చింది "కాళ్లు కడుక్కోండన్నయ్యా" అని చాప వేసింది. చెంబునీళ్లూ తీసుకువచ్చింది. చెలమయ్య కాళ్లూ, చేతులూ కడుక్కుని కాళినీళ్లు పుక్కిలించి ఉమ్మేశాడు. చాకబారురకం. ఫరవాలేదు. బిందో రెండుబిందెలో పంపునీళ్లు తెచ్చుకుంటే, ఆట్టే ఇబ్బందివుండదు.

"రాజమ్మవొదిన కులాసాగా వుందా?"

చెలమయ్య తల ఆడించాడు.

"కామందూ?"

"బాగానేవుంది."

"పెళ్లి ఈడేననుకుంటా. ఈచైత్ర వైశాఖాల్లో చేస్తారా?"

"ఇదిగో పురుడు వెళ్లాక—" అంటూ చెలమయ్య గడ్డం చేత్తో రాచుకున్నాడు.

"రాజమ్మ వొదినకు కాన్పులెడం బుల్లివాడు బావున్నాడా?"

"తలా వలా అంటున్నాడు"

శీతయ్య ఇంతలో వొడ్లోకెళ్లి, కాళ్లూ చేతులూ కడుక్కుని వొచ్చాడు. 'అమ్మయ్యా' అంటూ నులక్కక్కి వాల్చుకుని కూచున్నాడు.

"బావా, వొస్తా" అన్నాడు చెలమయ్య.

"అదేమిటన్నయ్యా, రాకరాక వొస్తివీ, భోజనం చెయ్యకుండా వెళ్తావా? రేపు పొద్దున వెళ్లచ్చులెండి!"

"రేపుపొద్దునే, అమ్మో!"

"మొత్తానికి నీబుద్ధి పోనిచ్చావు కావుగదా! బాగానే ఉంది!" అన్నాడు శీతయ్య.

"కాదమ్మా, పనుంది"

ఇద్దరూ బలవంతం చేశారు. చెలమయ్య మెత్తపడ్డాడు. "నే నుండమన్నానని చెప్పండి మావదినతో"

అంది శీతయ్యపెళ్లాం కిష్టమ్మ. అన్నాలు తినివచ్చి పిల్లలు, 'మామయ్య మామయ్య' అంటూ తనదగ్గిర కూచున్నారు. తనను చందమామను చూసినట్లు చూస్తున్నారు. చెలమయ్యకు లేవడానికి మనస్కరించలేదు. ఐనా మనస్సు పీక్కుతింటూనేవుంది. మొండిపట్టుపట్టి ఇంటి కెళితేమాత్రం?

"ఇదుగోనయ్యా, కాస్సేపు పడుకో. ఇంటోంచి ఎప్పుడు బయలుదేరావో ఏమో..." అంటూ శీతయ్య ఉత్తరియ్యం పైన వేసుకుని ఇంటోంచి బైటికి వెళ్లాడు. నెల అప్పుడే పొడిచింది. బారెడు సాగిందిగూడాను! ఇప్పుడొకవేళ యింటికి పోయినా, అది యింటో వుడకేసిందో, లేదో? ఏవో పన్లుచూసుకు తెల్లారివొస్తారని నిద్దరపెద్దమ్మరు నిద్రపోతే? పైగా భోజనానికి ఉండూ అంటూంటే మూర్ఖించిపోడం శోభస్కరం కాదు. హోటల్లో భోంచేసిపోదామా అంటే, వో పావలా పావలాగూడా ఈకరువురోజుల్లో సమర్పించుకోవాలి!

రివ్వున గాలి వీచింది. ప్రాణం సొమ్మసిలిపోయింది. కొంత కునుకుపట్టింది. రాజి పాలుపితకబోతే ఆవు ఎగచేపి తన్నినట్లూ, కుడితితొట్లో పడి బుల్లివాడికి దెబ్బ తగిలినట్లూ కలవొచ్చింది. అదిరిపడి లేచాడు. చందమామ ఫెళ్లున వెలుగుతున్నాడు. దడిమీది పొట్లకాయలు వెన్నెల తాగి మదించినై. యింటో చప్పుడేమీ లేదు. యిందాకణ్ణుంచీ 'కాళ్లాగజ్జా కంకణమ్మ' ఆడుతూన్న పిల్లలు నిద్దరోయినట్టున్నారు! కిష్టమ్మ పెత్తనానికి వెళ్లిందల్లే వుంది. యిల్లు నిద్దరోతున్నట్టుంది!

మళ్లీ ఆమంచంమీదే వాలాడు. నల్లులు పీక్కుతిన్నై. పోనీ, వెళుతున్నానని చెప్పేసి, దబదబా హోటల్లో చేతులు కడుక్కుని, నాలుగంగలు వేస్తే? యీ కిష్టమ్మ ఎప్పుడు రానూ, ఎప్పుడు వొండనూ! ఈ శీతయ్య ఎప్పుడు రానూ, ఎప్పుడు భోజనాలు కానూ!!

"అన్నయ్యా!"—కిష్టమ్మ వొచ్చింది.

"ఆఁ! అమ్మాయి, పిల్లాడికి దెబ్బతగిలినట్టు కల వొచ్చిందే అమ్మా, దబదబా నాలుగడుగు లేస్తాను."

"నిమిషంలో వంట అయిపోతుందన్నయ్యా! ఇదుగో వారు రాగానే మడికట్టుకుందుగాని. కలే గదా ఇంతకీ?"

తాను ఎరక్క చిక్కడ్డాడు. పోనీలే, భోజనం చేదా ఏమిటి? పావలా కలిసొస్తుంది. ఆ పావలా పెట్టి పిల్లలకు పిప్పరమెంటుబిళ్లలు తీసికెళ్లచ్చు. బుల్లివాడు 'పిపర్, నాన్నా పిపర్' అంటూ వొస్తాడు.

"నిమిషంలో ఐపోతుందన్నయ్యా" అంటూ కిష్టమ్మ లోపలి కెళ్లింది. ఎప్పుడూ ఇంతే. వీళ్లయింటో అర్ధరాత్రి నిశోయింతరువాతే భోజనాలు. కిష్టమ్మ ఎప్పుడూ పెత్తనాలే. ఎంత పెత్తనాలతో పని జాప్యం చేసినా, చల్లగా నెమ్మదిగా పలకరిస్తుంది. ఆదరణగా మాట్లాడుతుంది. ఈ వొక్కగుణమూ రాజిగ్గూడా వుండరాదూ? మరే, ఇంటిదగ్గిర ఏంగోలో, ఏమో? వీళ్లేమో నిష్ఠూర్యాలూ, నిందలూ. అయినా భోంచేసి, కాలుసాగిస్తే ఎంతసేపూ? గంటలో చేరుకోవొచ్చు. చందమామ రూపాయిబిళ్లల్లే నెమ్మదిగా జారుతున్నాడు.

"శీతయ్య వొచ్చాడా?"

—ఎవరూ పలకలేదు.

'సరే' అంటూ మళ్లీ వొరిగాడు. తొమ్మిద్దాటుతూండగా శీతయ్య వొచ్చాడు. కలేగదా అని ఎంత నిబ్బరించుకుంటూన్నా మనస్సు గుంజాటనగా వుంది. పోనీ కదుల్దామా అంటే, రెంటికీ చెడ్డ రేవడ అవుతాడు. కిష్టమ్మ ఇప్పుడు అత్తెసరు ఎక్కించి రోలు కడిగింది.

"లేవయ్యా బావా, లే"

చెలమయ్యప్రాణం ఎగిరి గంతేసింది. "కాళ్లు కడుక్కోవచ్చన్నయ్యా!" అంది కిష్టమ్మ.

"కడుక్కోవచ్చు అంటూ చక్కా వొచ్చావు గానీ, నీళ్లు ఏవీ" అన్నాడు శీతయ్య నిగ్గదీస్తూ.

"మడికట్టుకున్నానండీ!"

"ఇంకా నయం, విప్పేశావుకాదు!"

"ఏంమాటలవీ" అంటూ చెలమయ్య నూద్దగ్గిరి కెళ్లాడు. సాధింపుగా గొణుగుతూ కిష్టమ్మ యిల్లూడుస్తోంది. కిష్టమ్మ సాధించుకుంటోందీ!

తన బట్టలు ఉండచుట్టి జాగ్రత్తగా సూరులో పెట్టి, తడిపిన అంగోస్త్రం కట్టుకూర్చున్నాడు చెలమయ్య. శీతయ్య అంగోస్త్రమే తడుపు కూర్చున్నాడు.

భోజనం చేసి లేచేప్పటికి పది అయింది. చెలమయ్య బట్ట కట్టుకుని "అమ్మాయీ, వెళ్లొస్తానే" అంటూ అక్కణ్ణుంచి కదలబోతున్నాడు.

"ఏం అన్నయ్యా, తెల్లారి పోగూడదూ?"

"కాదమ్మ, మీవదిన వొకత్తా వుంటుందా మరి!"

"అంత పోవాలంటూంటే ఎందుకే" అంటూ శీతయ్య అరిచి, మంచంమీద వొరిగాడు. భోజనాలకు ముందున్న మర్యాద మాయమైంది. మళ్లీ లేచి సందు చివరదాకా సాగనంపి వొచ్చాడు. చంద్రుడస్తమించాడు.

చెలమయ్య బజార్లోకి వొచ్చేసరికి రోడ్లమీద నరసంచారం కట్టడుతోంది. దుకాణాలు మూసేస్తున్నారు. బట్ట ఎగ్గట్టి చెలమయ్య నడుస్తున్నాడు. తన దగ్గిర వున్న అయిదువొందల మూటా జాగ్రత్తగా చూసుకుని చెలమయ్య గబగబా అంగలేస్తున్నాడు. హఠాత్తుగా రోడ్లమీద ఎలెక్ట్రీదీపాలు ఆరిపోయినై. ఆరి భగవంతుడా! అయినా ఎంతలే, నాలుగుఅంగల్లో చేరుకోనూ. ముష్టి ఆరుమైళ్లు! కాస్తజోరుగా నడిస్తే గంటన్నర. కాలవకట్టమీంచి పోతే! గంటేననుకో. ఈచిమ్మచీకట్లోనా? దొంగలో, తోడుమోతులో— దెయ్యాలో భూతాలో. చెలమయ్య పొడుంకాయ తీసుకుని ఓచిటికె పీల్చాడు.

మనస్సులోకి పిరికి రానేగూడదు. వొచ్చింది.

"బండీ కావాలా?"

—వొంటెద్దుబండి.

"ఉఁహుఁ"అన్న చెలమయ్యను వాడు వినిపించుకోకుండా పోతున్నాడు. చెలమయ్య వో రెండు మూడు ఫర్లాంగులు నడిచాడు. నలనల్లగా- తెలతెలగా యిళ్లు కనిపిస్తున్నై. ఎవరికి దయ్యం పట్టిందో వోయింటో బిందెనాదాలు పోయిస్తున్నారు. ఆయింటిదగ్గిర మాత్రం దీపాల కాంతి వుంది. దూరాన ఎక్కడో పంబలవాళ్లుకాబోలు, వీరాంగాలు వేస్తున్నారు. పరువు చెట్లు దెయ్యాల్లాగ నిలుచున్నై. భూతవైద్యుడు దయ్యంపట్టినదాన్ని చావగొడుతున్నాడు. చెలమయ్య యీదురుగాలిలో వొణికినట్లు వొణికాడు. మద్దిచెట్ల దగ్గిర-అబ్బ-ఎన్ని మిణుగురుపువ్వులు! చీకట్లో అవి దొరసానిగోనులాగు మెరుస్తున్నవి. పోనీ వెనక్కి వెళ్లి బండీ కట్టించుకుంటే?—ఏడిసినట్టే వుంది నిర్వాకం. వున్నది అమ్ముకుని వొస్తావుంటే-బండీగూడానా? తింగరంగా అంటూ మళ్లీ నాలుగడుగులు ముందుకేశాడు. సొశానంలో ఎర్రగా మంటలు. పక్క వో గ్యాసులైటూ. చెలమయ్య ఇహ వొక్కణ్ణీ నడవలేనని నిర్ధరించుకున్నాడు. సొశానంచూచేప్పుడు వొళ్లు జలదరించింది. వెనక్కు మళ్లాడు. రోడ్డుమీది కంకరరాళ్లు కుక్కపళ్లల్లే గుచ్చుకుంటున్నై. పోనీ, శీతయ్య కొంపకు చేరితే? ఛీ; వెళితే వేలికచేస్తారు. పొడుంకాయ తీసి ఇంకోచిటికె ఎక్కించాడు. కాళ్లు వెనక్కడుతున్నై. కుక్కబుద్ధి! పిరికి అంటూ రానేగూడదుగాని, వొచ్చిందో పిచ్చికుక్క కరిచినట్టే. ఏం జేసినా లాభంలేదు. ఇల్లా మల్లాగుల్లా పడుతూ కూచుంటే, ఆఖరికి ఆ బళ్లుగూడా దొరకవు. బస్తీలో ఏఅరుగుమీదన్నా పడుకోవలసి వొస్తుంది. అక్కడేం శనో.

చెలమయ్య వెనక్కి నడిచాడు. దూరాన చెబుతూన్న కుద్దులు సొష్టంగా వినబడుతున్నై. "ఆఁ, ఛళాఛళీ"అంటూ అరుస్తున్నాడు. సొశానంలో గాస్ లైటు యింకా వుంది. భూతవైద్యుడు భూస్థాపితం చేయిస్తానంటున్నాడు. చెలమయ్య బెదిరిన స్వరంలాగా బజార్లోకి దౌడెత్తాడు.

"బండీ కడతా?"

"హెకడ్కి?"

చెప్పాడు.

"మూడు రూపాయలు"

"మూడురూపాయలే? బస్సుమీదైతే పావలే!"

"కట్టించా లేవయ్యా హ్హాండీ, మాకీ సెప్తా"

చెంపకాయ కొట్టినట్లయింది. రామరామ! ఎంత దుక్కమాలిన రోజు! తాత్సారం చేస్తూ అక్కడే నుంచున్నాడు.

"హెంతా ఇస్తా ?"

ఏం చెప్పడానికీ పాలుపోటం లేదు. దారుణంగా చెప్పేశె బండీవాడు.

"కట్టించిన మొక్హంలాగానే వుంది!"

పోనీ, యిక్కడే పడుక్కొని తెల్లారి వెళ్తే? బాగానే వుంటుందిగాని, రాజి నూతులోకి దూకదూ? మరీ చెలరేగిపోతోంది. చెంబులూ, తప్పాలాలూ నేల నేసి బాదనూ? పిల్లల్ని పశువుల్ని బాదినట్లు కొడుతుందాయె. ఈఆడవాళ్లతో ఇదే చావు. మొగాడు బయట ఏం అవస్థలు పడతాడో అనేది గమనించడం వాళ్ల నెత్తురులోనే లేదు.

"రూపా యిస్తా, రా"

"యిచ్చావులే రూపాయ్, తెల్లారాక బస్సులో పో, పావలే!"

బండీవాడు తన మాట తనకు అప్పజెప్పాడు.

"ఎంత ఇమ్మంటా?"

"మూడురూపాయలు!"

"సరిగ్గా చెప్పవయ్యా అంటూంటే—"

"రెండున్నర"

పొద్దున్నే ఎవరి మొహం చూచి బయలుదేరాడో, శీతయ్య పోగయ్యాడేం శనిదేవతలాగా! ఈ పాటికి తను మహారాజులాగా ఇంటిదగ్గిర ఉండేవాడు.

"కుదిరేమాట చెప్పూ!"

"రెండుంబావలా ఇస్తా?"

—పోనీ తెల్లారే పోతే?— "రెండురూపాయలకు కడతా?" ఎల్లాగో కట్టడుగదా అని చెలమయ్య అన్నాడు.

"వూఁ, పో, రా బేగీ" అని వో గుర్రాణ్ణి ముందుకు తోసి, బేరమాడినవాడు బీడీ ముట్టించాడు. 'దా' అంటూ ఆకుర్రాడు బండీ ముందుకు తెచ్చాడు. గుర్రంముందున్న పచ్చిగడ్డి బండీలో వేసి, "హకూ బేగీ" అంటూ నుంచున్నాడు. స్థానబలిమి. వీళ్లు ఎంత తేలిగ్గా మాట్లాడుతారూ!

చెలమయ్య ఎక్కాడు, రెండురూపాయలే అని మనస్సు పీకుతూవుంది. బొడ్డున మూట చూసుకున్నాడు. బండీ దబదబా లగెత్తుతోంది. రాజి తిట్టకుండాగదా తను ఇంత తగలేస్తోన్నది? ఎంత చిత్రంగా మారిందీరాజీ! కొత్తలోవున్న నేవళంఇప్పుడేమయిందో? క్షణం కనబడకపోతే తోచకపోడం, దాని కిష్టమని తను కొండపచ్చడి పొదంగా కలుపుకోడం, తన కిష్టమని అని రాచఉసిరికాయ పప్పుకూర చెయ్యడం— అన్నీ పోయినాయి. ఇప్పుడెంతసేపూ తిట్లూ పోట్లూటా. ఏమన్నా అంటే-పిల్లల్ని చెండుకుతినడమూ!

"వెనకా బరూ, ముందుక్కు రాండి!"

"నీపుణ్యెమాయిరి. నువ్వన్నా ముందుకు రమ్మన్నావు" అంటూ చెలమయ్య ముందుకు జరిగాడు. గాసులైటూ, దానిపక్కనే వోఫదిమందీ ఎదురొచ్చారు. గాసులైటు తొరతొరగా వెనక్కుపోతోంది.

బండీచప్పుడులో సుద్దులు వినబడడం లేదు. అరె, దయ్యంపట్టిన యిల్లుగూడా దాటివొచ్చేశారు. మైలురాయిగూడా దాటారు. చెలమయ్యకు ఎందుకో వొళ్లు ఝల్లుమంది.

"అబ్బాయ్, నీ పేరేమిటి ?"

"కాసిం"

"ఏ పేటా ?"

—చెప్పాడు.

అరి! వీడు తురకాడా? వోదారిలో బండీ ఆపి నిలబెట్టి దోచుకుంటే ?—ఏడిచాడుగదూ. "శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం, ప్రభో దివ్యచిత్తం ప్రకీర్తి ప్రకాయం భజే వాయుపుత్రం, భజే వాలగాత్రం—"

"హేమ్టన్డీ?"

"ఏంలేదు!"

"శాకినీఢాకినీ గాలిదయ్యంబులన్ నీదు వాలంబునం జుట్టి—"

"దయ్యాలేంటండీ గారూ!"

"ఏంలేవు!"

"హాగిపెట్టే వుందీ ?"

"లేదు."

"లాంతరు ఆరిపోయింది. ఫోలీసాడు చూస్తే ఫటుక్కుంటాడూ. నాదగ్గిరా కట్టో రెండో పుల్లల్"

"వాటితోనే వెలిగించు!"

"గాలికి ఆరిపోతే-"

"పోలీసు ఎక్కడ వొచ్చాడులే! పోనీ"

"తోల్ గేట్ కాడా. నీకీ తెల్వాహసల్"

చెలమయ్యకు బిక్కుబిక్కు మంటూ వుంది. పోలీ సెక్కడ వొస్తాడో, యామంటాడో, లేనిపోని కేసెద్దన్నా పెడితే?—మహాప్రభో శత్రువుకూడా వొద్దీబాధ!

తోలుగేటు దాటింది.

ఇదికూడా దాటిందిరా భగమంతుడా! యిహ వూరుచేరేదాకా వీడు ఆడింది ఆటా, పాడింది పాటా. ఏం రాసిపెట్టివుందో ఏమో?......

గుర్రం నెమ్మదిగా వొంటెద్దుబండీని ఆదర్శంగా పెట్టుకుంది. కాసిం లల్లాయిపదాలు విసురుతున్నాడు. చెలమయ్యకు దడ పుట్టినట్లయింది.

"కాసిం, నీకు పెళ్లయిందా?"

"కాలా"

"ఎక్కడన్నా"

"ఆఁ, ఎక్కడన్నా"

"మరేం లేదు, ఎక్కడన్నా—"

కాసిం నవ్వాడు. ఈలపాట పాడాడు. గుర్రాన్ని కంచీతో రెండు బాదాడు. చెలమయ్య నిబ్బరించుకుంటున్నాడు. రండ్రాఅని వాళ్లవాళ్లకు గుర్తా ఆ ఈలపాట? ఛ! అయివుండదు. ఏమో, ఏంకర్మ. ఎవణ్ణి నమ్మాడు. అంతా అందరే.

బండీ ఆగింది.

"ఏం, ఆగిందేం?"

"ఇప్పుడే వొస్తా"

చెలమయ్యప్రాణాలు పైన పోయినయి. అనుమానం ఏముందీ? వెళ్లాడు. వాళ్లవాళ్లను తెస్తాడు. నిమిషంలో కాసిం మాయమయ్యాడు. 'కాసిం, కాసిం' పలకడేం? హరి వీణ్ణిపాతెయ్యా, ఇదేం రోగం! అక్కడికీ కిష్టమ్మ "తెల్లారాక పోగూడదా అన్నయ్యా" అన్నది. తానే కాదు గూడదని బైలుదేరాడు. బైలుదేరాడంటే ఎందుకు బైలుదేరాడూ? యింటిదగ్గిర కాళికామ్మవారు బలి కోరుతుందని కదిలాడు. యీసారి రాజీ పణిగిందో, వీపు మోగిందే!

ఇంతకూ వీడేమైనట్లు? అదుగో బీడీరవ్వ. ఇక్కడ వీడి ముండ వుందికాబోలు. దాన్ని పంపిస్తాడా? చచ్చారా నాయనా. అది రావడం తడుముకోడమూనా, తూరుపుగా తిరిగి తను దణ్ణం పెట్టడమూనా! అదెవ త్తంటా. అది ఇంకా తెమిలిరాదేం! "ఛా వెధవా, నేను పోతానా" అంటూ పోట్లాడుతోందేమో. నీతేమిటి జాతేమిటి- అర్ధరాత్రివేళ ఇక్కడ వుండే ముండకు? 'కాశిం, కాశిం' తన నోరు పెగలదేం? ఐనా ఎందుకూ పిలవడం? ఏం జరుగుతుందో అదే కానీ. ...అమ్మా నీదయవల్ల ఈ ఆపదగడిచి...శ్రీ శ్రీరామచెంద్రమూర్తీ, ఈ ఆపద గడిచి యిల్లు చేరుకుంటే రేపు నీకు దీపారాధన చేస్తాను. కొబ్బరికాయ కొడతాను. అన్నట్లు దేవుడి పటాలు బాగుచేయించాలి. వెంకటేశ్వరస్వామిపటం సహాంఅద్దం ఊడివొచ్చేసింది కూడాను. కాముడు పగలగొట్టింది. తనే బద్ధకించి వేయించలేదు. రాములాంటి కోపం వొచ్చిందికాబోలు—యిల్లా పరీక్షిస్తున్నాడు. తల వేడెక్కింది. వొళ్లు గమత్తుగా వుంది. యిహ పడిశం పడుతుందిగాఁవును. "మనోజవం మారుతతుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం, వాతాత్మజం వానరయూధ—"యీ కాసిం తెమిలిరాడేం? "యత్రయత్ర రఘునాథ కీర్తనం తత్రతత్ర కృత-" తరువాత రాదేం?- "భావయామి పవమాననందనం. గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసం." అరే యిక్కడా నట్టుతుతోందే? "వందే లంకాభయంకరం-" యీ ముండగూడా బీడీ ముట్టించుకుని రాదేం యింకా? చల్లనిగాలి వీచింది. దేవుడు ఎప్పుడు తలుచుకున్నా పలుకుతాడు. తలనెప్పితగ్గలా? యీఆపద గట్టెక్కిస్తాడన్నమాటే. కాసింగాడు రాడేం? చెలమయ్య కిందకు దిగాడు. బొడ్డు సర్దుకుని, అల్పాచమానం చేసుకున్నాడు. పక్కన గుంటలో ఆకాశం ప్రతిఫలించింది. ఈ ఆకాశం ఎప్పుడూ ఇంతే. కాస్త తడి ఐతేచాలు కనబడుతుంది. అదుగో బీడీ! ముండ కాబోల్రా.

"కాశిం!"

"ఆఁ!"

"ఎక్కడికి కల్లా?"

అంటాడు కాబోలు!

"స్టాల్ సైడ్"

"అంటే—"

కాశిం నవ్వాడు. "రెండేళ్లకు"

"సరే, పెందరాళి పోనీ."

కాశిం బండీ ఎక్కి ఛల్ అన్నాడు. బండీ టకటకలాడింది. మనిషి రాంగానే కొత్త వెచ్చదనం పుట్టింది. వెధవ వొంటరితనం! అన్నీ ఛండాలపు గుణాలేకదా వొచ్చేవి. బొడ్డు తడుముకున్నాడు. మూట మూటగానేవుంది. ఎంత కూడనిదీ ఏకాంతం! "ఏకాంత రామయ్యా, ఎటులా బ్రోతువో తెలియా." చెలమయ్య మళ్లీ పాడుం పీల్చాడు. టర్రున చీదాడు. తను ఇలా పీడికి వొణికిపోగూడదు. పెద్ద రాడీగా కోసెయ్యాలి. ఏమో, వీణ్ణి నమ్మచ్చా! యింకొంత్తదూరం పోయాక లోకువకట్టి తిరగబడ్తాడు. యిలా ఐతేనా, తోసి రాజా ఆటకట్టూ!

"కాశిం, ఆవొంతెన చూచావా?"

"ఆఁ"

"అక్కడే వెనక ఎంత ఇదయిందనుకున్నావూ?"

—కాశిం మాట్టాడలేదు.

"ధాన్యం అమ్మకునీ...డబ్బుతీసుకొస్తున్నాను. దొంగలు ఆగూ అన్నారు. వరికర్ర తీసుకుని కత్తొబొడిచే సరికీ—"

"హెడ్డూ?"

"నిఝమ్. — తోకల్ తెంచుకునీ పరుగోహ్ ఫరుస్!"

కాశిం నవ్వాడు.

"రెండేళ్లప్పుడూ ఇంతే. పెళ్లి కల్లొస్తున్నాం. ఐదారుగురు మీవాళ్లే, చిలకల్లాగా వొచ్చారు. రెండుతుకులు వుతికేసరికీ—దీన్ దీన్ అంటూ తోక ముడపెట్టారు!"

కాశింవొళ్లు జలదరించింది.

"పిల్లకాకివి, నీ కెంతా వయస్సూ?"

"హంతే?"

"ఎన్నేళ్లూ?"

"పదహారు!"

"నీముందకూ?"

"ఫాండి"

"ఫరవాలేదులే-చెప్పూ"

"అస్మంటీమాటల్ మాకు తెల్దు"

"ఇదే మళ్లీనూ? చెప్పూ అంటుంటే—"

"దానికా, ఇరవై వుంటయ్"

"ఏకులం?"

కాశిం గుర్రాన్ని కంచీతో రెండు కొట్టాడు. కంచీ గమత్తుగా బండీచక్రంలో పెట్టాడు. టకటకలాడింది. గుర్రం దౌడుచ్చుకుంది. చెలమయ్యకు లోపలనించి సంతోషం ఎగతట్టింది. మూడుమైళ్లు వొచ్చేశారు.

"ఏకులం?"

కాశిం ఏదో చెప్పాడు. చప్పుడులో వినబడలేదు. చెలమయ్యకు హుషారెత్తింది. వొచ్చి కాశిం పక్కనే కూర్చున్నాడు. "కాశిం, ఏంజరిగిందో తెలుసా? నేను నీయీడున వున్నప్పుడూ, మాపాలేరు సముద్రిగాడి భార్యతో మనకు యిలాకాలే – దానికీ అప్పుడూ పాతిక. దాని మొగుడూ, వోరోజునా, నా వెనకా, ఏదోకూశాడు. నాసామిరంగా, చెంపాపగిలేట్టు చాచి రెండుచ్చుకునేప్పటికీ — చూస్కో..." చెలమయ్య కాశింను పొడివిపట్టుకున్నాడు.

'బాబోయ్' అంటూ కాశిం బండీలోంచి దూకాడు. గుర్రం అడ్డదిడ్డంగా గంతులేసింది. చెలమయ్యకు మళ్లీ గాభరావెత్తింది. ఇదేమిటీ వీడు ఇలా తయారయ్యాడు!

"కాశిం!"

పారిపోతున్నాడు.

"కాశిం!"

"పోబే, షైతాన్"

—లగెత్తుతున్నాడు.

చెలమయ్య బండీలోంచి దూకాడు. ఆతొందర లో బొడ్డులో మూటమాట జ్ఞాపక మేరా లేదు. కాశింను పట్టుకున్నాడు.

"మాబాబుగా, దా"

"వహిం తాక్"

"అన్నీ అబద్ధాలే, దా..."

"నన్ను వొదులూ"

చెలమయ్య వొదిలాడు. కాశిం పరుగో పరుగు.

"కాశిం!"

"పోబే—బొమ్మన్"

చెలమయ్య మళ్లీ వాణ్ణి పట్టుకున్నాడు. వాడు ఇహ లాభం లేదని లొంగి, రొప్పుతున్నాడు.

"దా, బండో"

"నాకి వచ్చీఫోతా"

"అబ్బే—అన్నీ అబద్ధాలే—దా"

"రానూ పో"

"గాయిత్రిసాక్షిగా, పోనీ, నీముండమీద వొట్టు. దా"

"పో"

"దా"

కాశిం నెమ్మదిగా వొచ్చాడు. వాణ్ణి బతిమాలి తీసుకొచ్చేసరికి తలప్రాణం తోక్కొ వొచ్చింది. కార్యంనాడు పెళ్లికూతురల్లేసాగదీయించుకున్నాడు. మళ్లీ ఛల్ అన్నాడు. గుఱ్ఱంపొత్తికడుపుమీద కాలి బొటనవేళ్లతో గోకాడు. జోరుచేసింది గుఱ్ఱం. చెలమయ్యకు చెమటలు జారినై. రవగాలికి కొత్త జోగడం మొదలు పెట్టాడు.

*   *   *

"తలుపు !"

తలుపు కొడ్తూ తలుపూ అని పిలవడం! రాజమ్మ తలుపు తీసింది. మొగుడు రావడం, వొస్తూనే లాంతరు పెద్దదిచేసి డబ్బుచూసుకోడమూనూ! చెలమయ్య కాశిం మాట మరిచాడు.

"బేగీ, బేగీ !"

"వాడెవడు ?" అంది రాజమ్మ.

"జట్కా బండీ"

"ఏం అర్ధరాత్రిపడి రాకపోతే ? తెల్లారి తగలడగూడదూ"

చెలమయ్య మాట్లాడకుండా వెళ్లి డబ్బు ఇచ్చాడు. రాజమ్మగూడా వెంటవొచ్చింది.

"హాగీ పేటీ హిస్తారూ"

"అగ్గిపెట్టా లేదు నీ బుగ్గిపెట్టా లేదు."

రాజమ్మ తలుపు ఢడేల్న వేసుకుంది. చలమయ్య నూద్దగ్గిరి కెళ్లి కాళ్లు కడుక్కుని వొచ్చాడు.

"బండీ కెంతా ?"—రాజమ్మ గర్జించింది.

"రెండురూపాయలు !"

'హమ్మమ్మో'అంటూ రాజమ్మ గుండె బాదుకుంది. చెలమయ్య మాట్లాడకుండా నిట్టూర్చి వెళ్లి రాములారి పఠందగ్గిర నించున్నాడు.

అతను కళ్లు మూసుకుని నుంచున్నా, దేముడి ముందర చెంపలేసుకుంటున్నా రాజమ్మ గుండె బాదుకుంటూనేవుంది !